

"నాన్నగారూ! నేను వదినని పెళ్లి చేసుకోవాలనుకొంటున్నాను" అన్నాడు నారాయణ

పక్కింట్లో టపాకాయ పేలింది అది తన వళ్లో పేలినట్టు అదిరిపడ్డాడు జానకిరామయ్య కొడుకేసి అర్థం కానట్టు చూసాడు నారాయణ మరోసారి తన కోర్కెను మరింత దృఢంగా వెలిబుచ్చాడు

"ఏమన్నావురా! ఏమంటున్నావో తెలిసే అంటున్నావా!" అన్నాడు జానకిరామయ్య నమ్మలేనట్టుగ.

"ఆలోచించండి" అని నారాయణ అక్కడ నుంచి జారుకొన్నాడు.

జానకిరామయ్యకి కొడుకు నడుస్తున్న కొత్తబాట నడవరాని చీకటిదారిగ కనిపించింది అన్న మాటలు అనరాని పాపపుమాటలా ఉన్నాయి ఆ క్రితం రోజువరకు పట్టిన ఈశాన్య ఋతుపవనాల ముసురు వల్లకంటేగూడా ఈ మాటలు జానకిరామయ్యలో ఎక్కువ వణుకు పుట్టించాయి నత్తగుల్ల భయం వేసినప్పుడు లోపల్లోపలికి ముడుచుకొన్నట్టు జానకిరామయ్య వరండానుంచి ఇంటి లోపలి తన గదివేపు కదిలాడు

తన గదివేపు వెళ్తూ కోడలు ఏం చేస్తోందో అని తొంగిచూసాడు పార్వతి భుజం మీద రెండేళ్ల కూతుర్ని వేసుకొని జోకొడ్తోంది అది ఆమె మనస్సును జోకొట్టుకోవటంలా అనిపించింది జానకిరామయ్యకి పార్వతి కళ్లెత్తి మావగార్ని చూసింది ఆ కళ్లలో అతనికి ఏ భావము కనిపించలేదు ముఖం ప్రశాంతంగా ఉంది నుదురు ఖాళీగా ఉంది పార్వతి కళ్లు దించుకొంది.

"బుజ్జి నిద్రపోయిందా అమ్మా!" అని అడిగేడు

"ఇప్పుడే" అంది పార్వతి ఆమె మనస్సు మాత్రం బుజ్జి పుట్టిన కొద్ది నెలలకే నిద్ర పోయింది

జానకిరామయ్య తన గదిలో మంచంమీద పడుక్కొన్నాడేగాని మనస్సు స్థిమిత పడలేదు. దీపావళి ఆగమనాన్ని సూచిస్తూ అవుతున్న శబ్దాలు పిన్నలకి పెద్దలకి ఆనందం కలిగిస్తుంటే జానకిరామయ్యకు మాత్రం ఆందోళన కలిగిస్తున్నాయి

అతని భార్య సీతమ్మ ఎంటింట్లో పని ముగించుకొని వచ్చేసరికి తొమ్మిది కొట్టింది. ఆమె రాగానే ఆమెతో మాట్లాడటానికి ఎదురు చూస్తున్న జానకిరామయ్య లేచి కూర్చున్నాడు

# నవశకం

''ఏమన్నా కావల్నా ?'' అని అడిగింది సీతమ్మ నవారు మంచం వాల్చుకొంటూ.

''ఏమక్కర్లేదు. నిద్రపట్టలేదు అంతే.''

''రిటైరయ్యాక మీకు ఆలోచనెక్కు వయ్యాయి. ప్రతీ దానికి మీకు చింతే! 'వృద్ధస్తావత్ చింతాసక్తః' అని ఉట్టినే అన్నాడా మహానుభావుడు! ఇంతకు ఎందుకు పట్టలేదు మీకు నిద్ర ?'' అని అడిగింది పక్క పరుచుకొని దానిమీద కూర్చుంటూ సీతమ్మ.

ఆమె ధోరణిని పట్టించుకోకుండా, ''నారాయణ నీతో ఏమన్నా అన్నాడా ?'' అని ఎదురు ప్రశ్నించాడు జానకిరామయ్య.

''దేనిగురించి ?''

''పార్వతి పెళ్లి గురించి.''

''మరో సంబంధం చూశాడుట ?''

''ఊఁ!'' జానకిరామయ్య నాన్చాడు.

''ఎవరో చెప్పాడా ?''

''పై సంబంధం కాదు.''

''మనవాళ్లలో ఎవరైనానా ?''

''మనింటోవాడే !''

''మనింట్లోవాడా ?'' ఆమె ఆశ్చర్యంగా అడిగింది తనకు తెలియకుండా ఎవరై ఉంటారా అని.

''నారాయణే చేసుకొంటాడుట'' జానకిరామయ్య తేల్చి చెప్పాడు. సీతమ్మకి తల భూచక్రంలా తిరుగుతున్నట్లు అనిపించింది. తేరుకొని,

''అయ్యో! అయ్యో! అదేమిటండీ! మీరు తప్పు విని ఉంటారండీ! వదిన తల్లితో సమానం. అల్లాంటి పాపపు మాటలు వినబడే ఇల్లు నిర్వంశమై పోతుంది. పార్వతి ఈ ఇంటికి చిన్నకోడలుగ కొత్తగా అడుగు పెడ్తుందా! ఎవరికి పుట్టిన బుద్ధిట. నారాయణకి పుట్టింది కాదు. ఎవరో కిట్టని బయటి వాళ్ల దుర్బోధ ఇది'' అంది బాధపడ్తూ.

''అల్లాగే అనిపిస్తోంది నాకూను. వీడెవర్నో 'మా వదినని చేసుకో' అని అడిగి ఉంటాడు. వాడు 'మా అందరికీ కట్టబెట్టాలని చూడకపోతే నువ్వే చేసుకొని ఉద్ధరించరాదా' అని వీడిని ఎద్దేవా చేసి ఉంటాడు. వీడికి పౌరుషం ముంచుకువచ్చి ఉంటుంది.'' జానకిరామయ్య ఊహించాడు.

''ఇది మరీ బావుంది. ప్రపంచంమీద వావి వరస అనేవి లేకుండా పోతాయా! దేముడూ దయ్యం లేవంటూ మాట్లాడే మొండి వెధవ లోకళ్లు తయారయ్యారీమధ్య. వాళ్లతో మనవాడి స్నేహాలు మాన్పించాలి'' అంది సీతమ్మ.


తన సంతానం ఏ విషయం గురించి అయినా తనకి భిన్నంగా ఆలోచించరని ఒకవేళ ఆలోచిస్తే అది పరాయివాళ్ల దుష్ప్రభావమే అయి తీరాలని నమ్మే స్వభావం సీతమ్మది.

''ఈ విషయంలో పార్వతి అభిప్రాయం ఏమిటో!'' అని జానకిరామయ్య తన అను మానాన్ని వ్యక్తపరిచాడు.

''ఏముంటుంది! తన మరిదే తనను కావాలనుకొంటున్నాడని తెలిస్తే అవమానం భరించలేక ఏ నూతిలోనో దూకి ఛస్తుంది. మీరు నారాయణ నోట్లో గడ్డి ందుకు పెట్టలేదు ?'' అంది. ఆవేశంగా అన్నాక ఆగింది. ఆగాక ఆలోచించింది.

''ఇదంతా పార్వతికి పుట్టిన దుర్బుద్ధికాదు కదా !'' అన్న ఆలోచన వచ్చింది. వచ్చిన ఆలోచన ఆమెకి భయం కలిగించింది.

జనవరి 1న హైదరాబాదులోని రవీంద్రభారతిలో 'సుప్రజా కళాక్షేత్రం' ప్రారంభోత్సవం సందర్భంగా వేదికపై ఉన్న జస్టిస్ సీతారామరెడ్డి, చలనచిత్ర నిర్మాత శ్రీ కె. రాఘవ, శ్రీ కె.వి. భాస్కరరావు, సంస్థ అధ్యక్షుడు శ్రీ డి. అంజయ్యనాయుడు, ప్రసంగిస్తున్న సంస్థ కార్యదర్శి శ్రీ చల్లా సుబ్రహ్మణ్యంగార్లని చిత్రంలో చూడవచ్చు.



''పార్వతినో కంట కనిపెట్టి ఉండాలి'' అనుకొంది.

''చూడు! రేపు అమ్మాయి అల్లుడూ వస్తారు. వాళ్లున్న రెండ్రోజులు రాద్ధాంతాలు, అఘాయిత్యాలు వద్దు. వాళ్లు వెళ్లాక మార్గం ఆలోచిద్దాం'' అని సూచించాడు జానకిరామయ్య.

'రేపు తన చెల్లెలు అనసూయ, బావ సుబ్బారావు వస్తారు. వాళ్లు తన అండన నిల బడ్తారు' అని నారాయణ ధైర్యం తెచ్చుకొని నిద్రకి ప్రయత్నం చేసాడు.

ఆ ఇంట్లో ఆ రాత్రి ఎవరు సరిగ్గా నిద్రపోలేదు. అయితే పార్వతి అది కేవలం నిద్ర పట్టని మరో రాత్రి మాత్రమే! పొద్దున్న ఎప్పటిలాగా నారాయణ, ''వదినా! కాఫీ!'' అనలేకపోయాడు, కాఫీ కలిపి పార్వతి గ్లాసుల్లో పోస్తున్నప్పుడు. ఆ క్రితంరోజు అతను తండ్రితో వ్యక్తపరిచిన అభిప్రాయంవల్ల పార్వతిని చూడ గానే ఇబ్బంది పడ్డాడు. సీతమ్మ గమనిస్తూనే ఉంది. పార్వతి యంత్రంలా పనిచేసుకొంటూ పోవడంవల్ల నారాయణ పార్వతితో ఏమీ చెప్పి ఉండడని అర్థం చేసుకొంది.

పార్వతిని కాఫీ ఇమ్మని అడగలేక తనే గ్లాసందుకొనేందుకు నారాయణ వంగుతుంటే సీతమ్మ తనే కొడుక్కి కాఫీ అందించింది. కాఫీ గ్లాసు తీసుకొంటూ నారాయణ తల్లి కళ్లల్లోకి చూసాడు.

రాత్రంతా కోపంతో కుతకుతలాడి అప్పుడే చల్లారుతున్న సీతమ్మ కళ్లు, బాగా కాలిన చిచ్చు బుడ్డి, కుండలోంచి ఎర్రదనాన్ని చిమ్మేటట్లుగ ఎర్రగా తోచాయి నారాయణకి.

కొందరికి సంఘంలో కట్టుబాట్లు దాట శక్యంగాని పెద్ద అవరోధాలలాగాను, ఆచారాలు మార్చుకోడానికి వీల్లేని పరమ ధర్మాలలాగాను కనిపిస్తాయి. కట్టుబాట్లు అవి ఏ అవసరం కోసం ఏర్పడ్డాయో ఆ అవసరం తీరిపోగానే అర్థరహితమై పోతాయి. అటువంటి వాటిని సడలించటం లేక అతిక్రమించటంవల్ల సంఘానికేమీ ప్రమాదం ఉండదని వీరు గుర్తించరు. ఉన్నవి ఉన్నట్లుంటే (స్టేటస్‌కో) ఏ గొడవ ఉండదు కదా అని వీళ్లు తమ మనస్సులోకి ఏ కొత్త ఆలోచన రానీరు. అంతకుముందు కనీసం ఓ పది మందైనా కొత్త మార్గాన నడిచిన నిదర్శనం (ప్రిసిడెన్సు) ఉంటే గాని కొత్త మార్గాన నడవటాన్ని వ్యతిరేకిస్తారు. ప్రిసిడెన్సుంటే కొంత నయం. కొత్త మార్గంలో నడిచే మొదటి కొద్ది మందిలో తాము ఒకరిగా ఉండటానికిష్టపడరు. సీతమ్మ ఆ కోవకి చెందిన మనిషి. నారాయణ తనేదారి తీయటానికి వెనుకాడడు.

తల్లి కోపంగా ఉందని గుర్తించి, పార్వతి మనసు తెలియకుండా ఆమెతో వాదన వృథా అని, కాఫీగ్లాసుతో నిష్క్రమించాడు. సాయంత్రం

వచ్చే అనసూయకోసం ఎదురు చూడటంతప్ప నారాయణ ఏమీ చెయ్యదలుచుకోలేదు. అనసూయ అతనికంటే ఒకటిన్నర సంవత్సరాలు చిన్నది. అతని మనస్సుని అర్థంచేసుకోగలదు. పార్వతిని రెండో పెళ్లికి అనసూయే ఒప్పించింది

* * *

క్రితం సంవత్సరం అనసూయ కొడుకుని తీసుకొని వినాయకచవితి పండుగకి వచ్చింది. అప్పటికి ఆమె పెద్దన్న పోయి ఏడాదిమీద మూడు నెలలయింది. ఆమె వచ్చేవరకు ఆ ఇంట్లో ఎవరు పండుగ చేసుకోవాలని అనుకోలేదు తను రాకపోతే ఆ ఇంట్లో ఆవరించుకొన్న స్తబ్దత పోదని తెలిసే వచ్చింది.

"ఏమ్రా! మా సుపుత్రుడిచేత పూజ చేయించరా!" అని అడిగింది.

"దీనికి అన్నయ్య పోయిన బాధ కొంచెం కూడా ఉన్నట్టు లేదే!" అనుకున్నాడు నారాయణ. తండ్రి నారాయణని మర్నాటి పూజకు కావలసిన ఏర్పాట్లు చూడమన్నాడు.

నారాయణ మూడేళ్ల మేనల్లుడిని తీసుకొని బజారుకు వెళ్లి వినాయకుడి బొమ్మా, గొడుగు పత్రి కొన్నాడు. తిరిగి వస్తూ దార్లో ఇంటి పురోహితుడిని కలిసివచ్చి పూజ చేయించమని కోరాడు.

"ఇంత ఆలస్యంగా చెప్పారేం బాబూ! ఇంకా నయం! నేను మరోచోట మాటివ్వలేదు" అన్నాడు పురోహితుడు.

"మా చెల్లెలు అనసూయ, వీడిని తీసుకొని వచ్చేవరకు మేం పూజచేసుకోవాలని అనుకోలేదు. ఇంకా అన్నయ్య జ్ఞాపకాలు పచ్చిగా ఉన్నాయి"

"కుమిలిపోతూ కూర్చుంటే జ్ఞాపకాలెప్పుడు పచ్చిగానే వుంటాయి మీ అమ్మగారు, నాన్నగారు, వదిన సంవత్సరంలో కొద్దిరోజులు, రోజులో కొద్దిక్షణాలు మీ అన్నయ్యని మర్చిపోవాలంటే, ప్రపంచ ధోరణిలో పడటం ఒక్కటే మార్గం. అందుకే పండుగలని ఓ ఏడాదిపాటు మానుకొన్నా తిరిగి చేసుకోవటం మొదలు పెట్టాలి. పోయిన వాళ్లని తలుచుకొంటూ బతికున్నవాళ్ల పట్ల మన కర్తవ్యాన్ని అశ్రద్ధ చెయ్యరాదు. మీ అన్నయ్య కూతురు, ఈ మేనల్లుడు ఉన్నారు కదా! వీళ్ల భవిష్యత్తు కన్నీటితో తడవరాదు. నవ్వుల పువ్వుల బాటమీద నడవాలి."

నారాయణకి అప్పుడు తెలిసింది, చెల్లెలు వచ్చి ఎంత మంచిపని చేసిందో!

మర్నాడు పూజానంతరం పురోహితుడు వ్రతకథ చదువుతున్నాడు.

"మరియు విధవ పూజించెనేని మరే జన్మ యందు వైధవ్యము పొందదు ..."

బుజ్జిని వళ్ళో పెట్టుకొని పూజ చేయిస్తున్న నారాయణ వదిన కళ్లల్లోకి చూసాడు. పార్వతికి ఆ క్షణంలో తనూ తన భర్త కలిసి పూజ చేసుకోటం గుర్తుకువచ్చింది ఆ తరువాత, బుజ్జి పుట్టాక ఇంట్లో చేసుకొంటున్న మొదటి వినాయకచవితి కదా ఇది అన్న ఆలోచన వచ్చింది. తండ్రి వడిలో కూర్చుని పూజ చేసుకొనే అదృష్టంలేదు దానికి. పినతండ్రి వడిలో కూచుంది తన పిల్ల తండ్రి లేనిది అన్నభావం కలుగగానే ఆమె కళ్లలో నీళ్లు తిరిగాయి. పండుగనాడు ఏడవరాదని నిగ్రహించుకొంది

ఆమె కళ్లల్లో నీళ్లు చూడనే చూసాడు నారాయణ ఆమె కళ్లల్లోకి కాంతి తిరిగి రావాలంటే ఏంచేస్తే బావుంటుందా అన్న ఆలోచనలో పడ్డాడు.

సాయంత్రం నాలుగ్గంటల వేళ అనసూయ నారాయణకి ఓ పళ్లెంలో ఉండ్రాళ్లు పెట్టి అల్లపచ్చడి వేసి ఇచ్చి తనూ తింటూ ఎదురుగా నారాయణ గదిలో కూర్చుంది.

"అనసూయా! వదిన విషయంలో ఏం చేస్తే బావుంటుంది?" అని అడిగాడు నారాయణ

అనసూయకి నారాయణ చదువు గురించా, ఆస్తి గురించా లేక ఉద్యోగం గురించా మాట్లాడుతున్నది, తెలియలేదు.

"ఏమైందిప్పుడు?" అని అడిగింది

"జీవితం మోడైపోయింది. ఇప్పుడు వదిన వయస్సు ఇరవైమూడు. నీకంటే ఏ ఆర్నెల్లో పెద్దది. అప్పుడే ఆమె బతుకుకి బుజ్జి తప్ప మరో అర్థం లేకుండా పోయింది ఇది న్యాయమేనా?"

అనసూయకి నారాయణ బాధ అర్థమైంది. "వదిన మళ్లీ పెళ్లి చేసుకోవాలంటావు!" అంది.

"మరే నువ్వు వదినని ఒప్పించు నేను నా స్నేహితుల్లో మంచివాడు ఆదర్శవాది అయిన వాడిని ఒప్పిస్తాను" అని అర్థించాడు.


ఆ మర్నాడు పెరట్లో చాప మీద పూలు పోసుకొని పూలు గుచ్చుకొంటూ అనసూయ పార్వతితో కబుర్లు మొదలు పెట్టింది తల్లి లోపల పని చూసుకొంటోంది. బాబు, బుజ్జి ఆడుకొంటున్నారు అనసూయ పార్వతిని కబుర్లలో పెట్టి మెల్లిగా సంభాషణ, పూల మీద నుంచి రెండో పెళ్లి మీదకి తిప్పింది.

పార్వతికి అంతకుముందు తనకు రెండో పెళ్లి సంబంధం అన్న ఆలోచన రాలేదు. ఎందుకంటే ఆమె పుట్టింటి వారు కూడా దాన్ని సూచన ప్రాయంగా అనలేదు. సంభవం అను అనుకోని దాని పట్ల ఆశ, ఆలోచన రాలేదు. ఈరోజు ఆ ప్రసక్తి వచ్చింది! దానికి ప్రతి చర్యగ పార్వతి ఆలోచనలో పడింది ఆమెకు మొదట వచ్చిన ఆలోచన తనకి రెండోపెళ్లి అవసరమా, వాంఛితమా అని కాదు. ఆ ప్రశ్నలకి జవాబులు వయస్సులో ఉన్న ప్రతి విధవరాలికి అంతరాంతరాల్లో తెలుసు. అందుకనే ఆమెకి మొదట, తెలిసీ తెలియని, అర్థమయ్యీ కాని కలగబోయే ఇబ్బందుల గురించి బెంగ కలిగింది. తన చుట్టూ ఉండే జనం ఆడవారికి రెండోపెళ్లి తప్పని, ఒప్పని అనేక సందర్భాలలో చెప్పుకొంటూ ఉండగా విన్న అభిప్రాయాల వలన కలిగిన గందర గోళ పరిస్థితి నుంచి భయం కలిగింది

"మొగుడితో కాపురంచేసి పిల్ల తల్లినైన నాకు రెండోపెళ్లి అంటే వినేవాళ్లు అన్నవాళ్ల మూతి మీద వాత పెడ్తారు." అంది పార్వతి. అంతేగాని "నేను చేసుకోను" అనలేదు. అనసూయ అది గమనించింది పార్వతి తన నుంచి ధైర్యం పొందాలని చూస్తోంది. తను చెయ్యవలసినది, పార్వతి ఆమె నిర్ణయం తెలియజెప్పేందుకు కావలసిన ధైర్యం ఇవ్వటం అని తెలుసుకొని,

"ఎందుకు పెడ్తారు వాత! ప్రపంచంలో వేలకొద్దీ మగవాళ్లు రెండోపెళ్ళి చేసుకోవటం లేదా! ఈ సంఘమే వాళ్ళని చేసుకోమని ప్రోత్సహించడం లేదూ! మనలో అంతమంది కాకపోయినా వీరేశలింగంగారి ధర్మమా అని ఈ రోజుల్లో వేలల్లో కాకపోయినా వందల్లో అయినా రెండోపెళ్లి చేసుకొంటున్నారు కదా!"

"మీ అన్నయ్యగార్ని మర్చిపోవటం



సాధ్యమా ! కొన్ని సంవత్సరాలు కలిసి కాపురం చేసిన జీవిత భాగస్వామిని మర్చిపోవటం నిజంగా సాధ్యమా ! మరొకరితో సర్దుకుపోతానేమోగాని అవసరానికి.''

''బావుంది వదినా ! మా ఆయనకి నేను రెండోభార్యను కానా ! ఆయన నాతో అవసరానికి సర్దుకుపోతున్నా రంటావా ! అల్లా అయితే నేను బ్రతకగలనా ! ఆయనకి నామీద ప్రేముంది అనురాగముంది. ఈ రోజున నేను ఆయనకి ఏకైక భార్యను మొదటి పెళ్లి గతం రెండో పెళ్ళి వర్తమానం గతం ఎంత గొప్పదైనా వర్తమానం అంత విలువైనది కాదు ''

''కాని బుజ్జిమాటో !''

'' బాబుకి నేను సవితితల్లిని కాదూ ! అల్లాగే నీ కొత్తభర్త బుజ్జికి సవతి తండ్రి అవుతాడు నేను బాబుని ప్రేమించినట్టే అతగాడు బుజ్జిని ప్రేమిస్తాడు బాబు నాకు చేరిక అయినట్టే బుజ్జి అతనికి చేరిక అవుతుంది''

''రెండూ ఒకటి కాదు''

''ఒకటే !''

''పోనీ అల్లాగే అనుకొన్నా అన్నీ సవ్యంగా ఉంటే కూడా ఆడపిల్లలకి పెళ్ళి కావటం కష్టమౌతున్న ఈ రోజుల్లో, నన్ను విధవని సంతానవంతురాల్ని, కట్నంకానుకలు లేనిదాన్ని ఎవరు చేసుకొంటారు !'' అంది నిస్పృహ ధ్వనిస్తూ

''అల్లాంటి ఆదర్శపురుషుడు దొరికితేనే చేసుకొందువుగాని దొరకకపోతే మానేద్దువుగాని నువ్వెలాగూ మళ్ళీ పెళ్లిచేసుకొని తీరాలన్న ప్రయత్నంలో లేవుకదా ! నీకు పెద్దగా ఆశలేదు కనక నిరాశ ఉండదు ''

అనసూయ ఈ విషయం తల్లిదండ్రులతో ఎత్తినప్పుడు సీతమ్మ, ''అల్లాంటిది మనింట లేదు'' అంది మామూలు ధోరణిలో అంతేగాని పెద్దగా అభ్యంతరం చెప్పలేదు విధవా వివాహాలు కొత్తవిషయం కాదు కనుక చాలా ప్రిసిడెన్సు లున్నాయి కనుక

''ఆ పిల్లతెచ్చిన డబ్బు ఆమె పేరు మీద పెడ్తాను'' అన్నాడు జానకిరామయ్య

''నా స్నేహితుల్లో మంచివాడిని తెచ్చి చేస్తాను'' అన్నాడు నారాయణ ఉత్సాహంగా

*　　　*　　　*

పార్వతికి సంబంధాలు చూడటం మొదలు పెట్టాకగాని అది ఎంత కష్టమైన పనో నారాయణకి అర్థం కాలేదు. నెమ్మదిగా సిద్ధాంతరీత్యా ఆదర్శాలు వల్లెవేయటానికి, ఇతర్లు ముందుకు వస్తే మెచ్చుకోడానికీను, స్వంతంగా ఆచరించడానికి ధైర్యంగా ముందుకు రావటానికిగల తేడాలు తెలిసివచ్చాయి ఏడాది గిర్రున తిరిగినా నారాయణ ప్రయత్నాలు కలిసి రాలేదు పార్వతి మొదటినుంచి అది సంభవమని మనస్ఫూర్తిగా అనుకోకపోవడం వల్ల పెద్దగా

# నవశకం

నిరాశపొందలేదు కుంగిపోలేదు అందుకని సీతమ్మ తన కోడలికి మరో పెళ్లి చేసుకోవాలన్న కోరిక లేదని నిర్ధారణకి వచ్చింది

తన ప్రయత్నాలు వ్యర్థమౌతున్న కొద్దీ నారాయణకి పంతం పెరిగింది ఒక రోజున అనసూయ సుబ్బారావుని చేసుకొంటేలేని తప్పు తను పార్వతిని చేసుకొంటే ఏముంది అన్న ఆలోచన వచ్చింది అతను తన ఆలోచన స్నేహితుల్తో చెప్పినప్పుడు వాళ్లల్లో చాలామంది ఇబ్బందిగా ముఖాలు పెట్టారు ఒకరిద్దరు మెచ్చుకొన్నారు పార్వతికి భర్త పోయిన రెండున్నర సంవత్సరాలకి దీపావళికి మూడు రోజుల ముందు నారాయణ తండ్రికి తన అభిప్రాయం చెప్పాడు

*　　　*　　　*

నరకచతుర్దశి మర్నాడుదయం అనగా మధ్యాహ్నానికి అనసూయ, ఆమెభర్త సుబ్బారావు, నాలుగేళ్ల బాబు వచ్చారు

## ఎలక్ట్రానిక్ దిక్సూచి !

పశ్చిమ జర్మనీలో మత్తయికి అనే 19 సంవత్సరాల విద్యార్థి ఎలక్ట్రానిక్ దిక్సూచిని తయారుచేశాడు జడత్వం లేకుండా, ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా పనిచేసే ఈ ఎలక్ట్రానిక్ దిక్సూచికి, యువ శాస్త్రవేత్తల కోసం నిర్వహింపబడే పోటీలలో ప్రథమ బహుమతి లభించింది ఇటీవల పశ్చిమ బెర్లిన్‌లో జరిగిన అంతర్జాతీయ రేడియో టెలివిజన్ ప్రదర్శనలో ఈ బహుమతిని బహూకరించారు విద్యార్థులలోని మేధశక్తిని ప్రోత్సహించి సద్వినియోగం అయ్యేలా చూడటానికి యేటేటా ఈ పోటీలను నిర్వహిస్తారు పలు యువ శాస్త్రవేత్తలు ఈ పోటీలద్వారా వెలుగులోకి వచ్చారు

''ఇంటికి పండుగ కళ వచ్చిందే నువ్వు వస్తే'' అంది కూతురితో సీతమ్మ

''మరి నేను వస్తేనో అండి ?'' అని సుబ్బారావు నవ్వుతూ అడిగాడు

''ఇంటికి అల్లుడు వస్తే సంతోషంతో పాటు ఏ గొంతెమ్మ కోర్కెలు కోర్తాడో అని మా భయం బావగారూ!'' అన్నాడు నారాయణ

''ఇంకా పాత అల్లుళ్లకి భయపడే వాళ్లున్నారా ! నువ్వు రేపు పెళ్లాడే మీ మామ గారు కొద్ది రోజులు భయపడ్తారేమో ! ఇంతకు నీ పెళ్లెంతవరకు వచ్చింది ? మీ వాళ్లేమన్నా ప్రయత్నాలు చేస్తున్నారా ? నేను చెయ్యనా ? లేక నువ్వే చేసుకొంటున్నావా ? ప్రేమవివాహాలు చేసుకొన్న వాళ్లకి అత్తవారు మొండిచెయ్యి చూపిస్తారు జాగ్రత్త !'' అన్నాడు సుబ్బారావు

నారాయణ నవ్వి ఊరుకొన్నాడు జానకిరామయ్య ఇబ్బందిగా ముఖం పెట్టి మాట తప్పించాడు. అనసూయ దృష్టినుంచి తండ్రి అయిష్టత తప్పించుకోలేదు. నారాయణ ప్రేమలో పడ్డట్టున్నాడు, తల్లిదండ్రులు ఆమోదించినట్టు లేదు అనుకొంది. తరువాత నారాయణని ఒంటరిగా పట్టుకొని అడిగింది.

''నేను పార్వతిని పెళ్లి చేసుకొందామను కొంటున్నాను. ఆమె ఒప్పుకొంటే'' అన్నాడు నారాయణ వదిన అనకుండా మొదటిసారి పార్వతి అనటం అనసూయ గుర్తించింది

''అదెల్లాగా ! మన సంస్కృతిలో వదిన పూజ్యురాలు కదా !'' అంది. అనసూయకి నారాయణ పార్వతిని చేసుకొంటాననడం ఎబ్బెట్టుగా అనిపించింది

''వదిన పూజ్యురాలే! కాదనను అక్క భర్త బావ పూజ్యుడు కాదా మరదలికి ?''

''కాకపోవడం ఏమిటి ?''

''మరి నువ్వు అక్క పోయిన ఏడాదిలోపలే బావగార్ని పెళ్లి చేసుకొన్నప్పుడు నీకు చేస్తున్న పని తప్పుగా అనిపించలేదా !''

''అనిపించలేదు అది లోకంమీద ఉన్నదే ! తల్లి అన్నదమ్ముడి కూతుర్ని మేనరికం పేరిట చేసుకొంటారుగాని అప్పచెల్లెలి కూతుర్ని పెళ్లి చేసుకోరుకదా ! అవటానికిద్దరు ఫస్ట్ కజిన్సే క్రాస్ కజిన్స్ మధ్య వివాహం ఒప్పిన మన సంఘం పేరలెల్ కజిన్స్ మధ్య ఒప్పదు.''

''మన హిందూమతం ఒప్పదు తురక మతం ఒప్పుతుంది నువ్వు చెప్తున్నది కండిషనింగ్‌కి సంబంధించింది వదిన మరో జన్మ వరకు వైధవ్యం అనుభవించాల్సిందేనా !''

అనసూయ జవాబు చెప్పలేదు నారాయణతో ఏకీభవించనులేదు. అక్కడ్నుంచి వెళ్లిపోయింది. నారాయణ ఉత్సాహం దమ్ముకొన్న మతాబులాగా రగులుకోక చల్లారిపోయింది

సాయంత్రం సుబ్బారావుతో నారాయణ వ్యాహాళికి వెళ్లినప్పుడు తన ఆలోచన అతనో చెప్పాడు నారాయణ

''మంచి పని చేస్తానంటున్నావు. నీకు నా సపోర్ట్ ఎప్పుడూ వుంటుంది'' అన్నాడు వాళ్ల పక్కనుంచి తారాజువ్వ ఆకాశంలోకి దూసుకుపోయింది నారాయణ ఉత్సాహంలాగా

''నన్ను ప్రోత్సహించిన అతి కొద్ది మందిలో మీరొకరు అందరు వ్యతిరేకించినవారే ! పార్వతి ఏమంటుందో! ఆమెని ఒప్పించే బాధ్యత మీదే!''

''తప్పకుండాను ! ఆ పనికి అనసూయను నియోగిస్తాను ''

''ముందు దాన్ని ఒప్పించాలి !''

''భర్త చెప్పినది భార్య, భార్య చెప్పినది భర్త ఒప్పుకొనే సమయాలు కొన్ని ఉంటాయి చెప్తాలే !'' అన్నాడు సుబ్బారావు చిరునవ్వుతో

ఆ రాత్రి అనసూయ తెల్ల చీర కట్టుకొని పూలపరిమళాలు పోగేసుకొని వచ్చింది. స్త్రీలకి పుట్టింట్లో కొత్త పెళ్లి కూతుళ్ల కళ వచ్చేస్తుంది అనుకున్నాడు సుబ్బారావు. గదిలోకి పెద్ద వెలుతురు రాగా తేరిపార చూడలేకపోయినట్టు కళ్లు మూసుకొని, "ఏమీ మెరుపు! ఏల నాకీ మైమరపు"

"చాల్లెండి బడాయిలు" అంది అనసూయ నవ్వుతూ.

"సుపుత్రుడేడి?"

"వదిన వాడిని బుజ్జితోపాటు తన దగ్గర పడుక్కోబెట్టుకొని అన్నగారికి సహాయపడింది."

"కాంతా! ఈ ఏకాంతం నావంతా!"

"ఈ తంతంతా మీకోసమే శృంగారవంతా!"

"అయితే లలామా! నా కౌగిలిలో కరిగిపో! కాలమా తరిగిపోకు" అనసూయ అతని కౌగిలిలో కరిగిపోయింది

"పాపం నారాయణ ఓ మంచిపని చెయ్యాలని ఉత్సాహపడుతున్నాడోయ్! మనం కొంచెం సహాయం చెయ్యాలి" సుబ్బారావు నారాయణ విషయం ఎత్తాడు

"వదినా మరుసలు కాపురం ఎల్లా చేస్తారండి! అన్నయ్య స్మృతులు అడ్డురావా? నలుగురు నోట్లో గడ్డిపెట్టరా?"

"మీ అక్కయ్య స్మృతులు మనకడ్డు వస్తున్నాయా! మనిద్దరం ఆమెను మర్చిపోయామా? లేదే! అల్లా అని మనిద్దరం సర్దుకుపోవడం లేదు. అదీ నిజమే! ఇదీ నిజమే! ఒకటి గతానికి సంబంధించింది మరొకటి వర్తమానానికి సంబంధించింది. ఇంక నలుగురు నోట్లో గడ్డిపెట్టడం విషయానికి వస్తే నలుగురి మాట ఎల్లా ఉన్నా ఇంట్లోవాళ్లు పెట్టే గడ్డి ఎక్కువై భరించలేకపోతున్నాడు."

"అమ్మ నాన్నగారు ఒప్పుకోరు నాకు తెలుసు"

"నిన్ను నాకిచ్చి పెళ్లి చెయ్యటానికి ముందరకి వచ్చిన వాళ్లీ విషయంలో ఎందుకు సందేహిస్తున్నారో!"

"ఏమండీ! ఎన్నో సందర్భాలలో నారాయణ అన్నయ్యకి, వదినకి పాదాలు అంటి నమస్కారం చేసాడు పూర్వం. అటువంటి వదినతో నారాయణకి పెళ్లంటే ఏమిటోగా ఉంది నాకు."

"పాదాలంటి నమస్కారం చేసినవాళ్లతో కాపురం చెయ్యరాదని ఎక్కడలేదే! ప్రతీ సినిమాలో భార్య భర్త పాదాలంటి నమస్కారం చేసే సీన్లుంటున్నాయికదా! సినిమాల్లో సగం నిజం ఉన్నా కొంతమంది భార్యలైన భర్తను దైవ సమానుడిగా భావిస్తూ, కూడా కాపురాలు చేస్తున్నారన్నమాటే! శృంగారం నడుపుతున్నారన్నమాటే! నువ్వు నా కాళ్లకి దండం ఎప్పుడూ పెట్టలేదనుకో! కాని వాళ్ల మాటేమిటి! కాళ్లకి దండం పెట్టారు కనక, 'మీకు నాకు దూరం' అనాలావాళ్లు, వాళ్ల భర్తలో? పూజ్యభావానికి కాపురం చెయ్యటానికి సంబంధం ఏమిటి? నారాయణ పార్వతి చెయ్యబోయేది కాపురం! రంకుకాదు."

"ఛీ! ఛీ! మరీ అల్లా మాట్లాడకండి."

"ఈ అభ్యంతరాలు చెప్పే వాళ్లందరికి ఆ రెండింటికి తేడా తెలియక అంటున్నారేమో అనిపించి అన్నాను."

"మా వదిన నారాయణని పెళ్లి చేసుకొంటే బుజ్జికి రేపు పెళ్లవుతుందా?"

"మహారాజులా! కాలం ఎప్పుడూ ఇలానే ఉండదు. పైగా మన సుపుత్రుడు ఉండనే ఉన్నాడు. అంతగావస్తే, మేనమావ పోలికవస్తే వాడూ ఓ ఆదర్శవాది అవుతాడు. నా భార్య వాడినంత సంకుచితంగా పెంచదు."

"చాల్లెండి పొగడ్తలు నన్నేం చెయ్యమంటారు?"

"మీ వదినకి నారాయణలో ఏమీ లోపం కనిపించకపోతే ఆమెను ఈ వివాహానికి ఒప్పించు"

"చిత్తం"

తెల్లారకుండా సీతమ్మ లేచి అందర్ని నిద్రలేపి తలకి నూనె పెట్టింది బుజ్జి చేత, బాబు చేత కాకరపువ్వొత్తులు కాల్పిస్తుంటే చీకట్లు విచ్చుకొన్నాయి

ఆరోజు వీలు చూసుకొని అనసూయ పార్వతికి నచ్చచెప్పింది.

"వదినా! అన్నయ్య పోయినప్పుడు నువ్వు చాలా బాధ పడ్డావు! ఇప్పటికీ పడుతున్నావు. అన్నయ్యను నువ్వు పూర్తిగా మర్చిపోలేవు అన్నయ్య లేని లోటు నీకు రకరకాల సమయాల్లో రకరకాలుగ తెలుస్తూనే ఉంటుంది అయితే ఏదో ఒక రకమైన వ్యాపకం పెట్టుకొంటే ఆ లోట్లను –గురించి ఆలోచిస్తూ మథనపడే సమయం తగ్గుతుంది కాని లోటు పూడదు లోటు చాలావరకు పూడాలంటే నువ్వు మళ్లీ పెళ్లి చేసుకోవడమే మార్గం."

"ఇదంతా మళ్లీ ఎందుకు చెపుతున్నావు అనసూయా! నేను సమ్మతించాను కదా! నన్ను చేసుకొనేందుకు ఎవరు ముందుకు రాలేదన్న విషయం నీకు తెలుసు కదా!" అంది పార్వతి.

"ఒకరు ముందుకు వచ్చారు. కాని నువ్వు ఒప్పుకోవేమోనని జడుస్తున్నాడు"

"ఎవరు అంత ధైర్యంగా ముందుకు రాలేని వ్యక్తి?" విధవను, అందులోను సంతానవతిని ధైర్యంగా వివాహం చేసుకోడానికి ముందుకు వస్తున్న వ్యక్తికి తనతో చెప్పడానికి అధైర్యమా! తనకి తెలిసిన వాళ్లే అయి ఉండాలి! అనుకొంది పార్వతి.

"చెప్తాను చెప్పేముందు నా మాటలు శ్రద్ధగావిని నిర్ణయం తీసుకో మనమంతా ప్రస్తుతంలో జీవిస్తాం గతం కలలా గుర్తుంటుంది నిన్నటికి ఈరోజు ముడిపడి ఉన్నా, చాలా దూరంగా అనిపిస్తుంది నిన్న గతించిపోయింది ఎంత ప్రయత్నం చేసినా అది తిరిగి రాదు. ఎంత కాదన్నా వర్తమానంలో బతకక తప్పదు అన్నయ్య బతికుండగా నేను నీకు ఆడబడుచుని, నారాయణ నీకు మరిది, మా అమ్మా నాన్నగార్లు నీకు అత్తమామలు మన మధ్య ఆ చుట్టరికాలు అన్నయ్యతో నీ వివాహం ద్వారా ఏర్పడ్డాయి అంతకు ముందు లేనివి. నిజానికి ఇవి అన్నయ్య పోవడంతో రద్దవాల్సినవి.



నువ్వు మా మరిదిని చేసుకొంటే మనిద్దరం తోటి కోడళ్ల మవుతాం."

"మీ మరిదా!" ఆశ్చర్యంగా అంది పార్వతి.

"కాదు నిజానికి ముందుకు వచ్చింది నీ మరిదే! నారాయణ వాడి ఒక్కడితోనే నీ సంబంధం మార్తుంది. మాతో చుట్టరికాలు పూర్వంలాగానే ఉంటాయి ఇదంతా నువ్వు ఒప్పుకొనే పక్షంలోనే!"

పార్వతి ఆ మాటలు విని బెదిరిపోయింది అనుకోని ఎదురుచూడని వార్త. తన భర్త స్థానంలో మరిది! నారాయణ మంచివాడే! ప్రయోజకుడే బుజ్జిని స్వంత కూతురిలాగా ఆదరించగలిగినవాడే! కాని తన మరిది!

"నా స్వంత మరిది నాకు భర్త!" అంది పార్వతి అసంభవమైన విషయంలా తోచి

"నువ్వు ఒప్పుకొంటే నారాయణ నీకు భర్త! పోయిన మా పెద్దన్నయ్య నీకు బావగారు నారాయణ నీ మరిది అనేది గతం అవుతుంది. వర్తమానంలో వాడు నీ భర్త అవుతాడు బుజ్జి గురించి కూడా ఆలోచించు దానికి తండ్రి లేని లోటు నువ్వు ఈ విధంగా తప్ప మరోలా తీర్చలేవు మా ఆయన నాకు ఒకప్పుడు బావగారు పూజ్యుడు తండ్రిలాంటి వాడు కాని అక్కయ్య పోయాక నాకు భర్త ఇప్పటికీ పూజ్యుడే ఆయనకి నన్ను ఇవ్వటం తప్పని మావాళ్లు ఆలోచించలేదు భార్య చెల్లెల్ని చేసుకోడమేమిటని ఆయన అనుకోలేదు నాకుకూడా ఆయన్ని చేసుకోడం అనుచితం అనిపించలేదు చుట్టాలు పక్కాలు తప్పనలేదు. అందరు ఆమోదించారు అక్క స్మృతుల నిద్దరం అనురాగంతో గుర్తు తెచ్చుకొని నెమరు వేసుకొంటాం చచ్చిపోయిన అక్కయ్యకు అన్యాయం చేస్తున్నామనే గిల్టీనెస్ లేకుండా అన్యోన్యంగా ఉంటున్నాం నువ్వు, నారాయణ ఎందుకు అల్లా ఉండలేరు? మీ కొత్త బాంధవ్యాన్ని సమాజం ఎందుకు ఎగతాళి చేస్తుంది? ఆలోచించుకో!"

పార్వతి ఆ రోజంతా ఆలోచించింది. ఆలోచించినకొద్దీ అనసూయ మాటల్లో అనుచితమైనది కనపడలేదు. పైవారి నెవర్నో చేసుకోడం, కొత్త ఇంట్లో తిరిగి ఎడ్జస్ట్ అవటంకంటే ఇది ఎన్నోవిధాల నయం వాంఛనీయం! బుజ్జి భవిష్యత్తు అంధకారంగా ఉండరాదని తను కోరుకుంటే తను ప్రయత్నించి దీపం వెలిగించాలి! తనకోసం అందరు పెద్ద మనసుతో ఆలోచిస్తుంటే తనేనా తనగురించి తపించనిది తన మంచికి తనుకూడా ప్రయత్నించాలి. విధికి వదిలేసి నిర్లిప్తంగా ఉండరాదు

అనసూయ చీకట్లు పడేవేళ దీపాలు వెలిగిస్తుంటే పార్వతి సాయం చేసింది



సుబ్బారావు వింటుండగా, నారాయణతో ధైర్యంగా, "నా కిష్టమే!" అంది కృతనిశ్చయురాలై దీపాల వెలుగులో ఆమె కళ్లు మిలమిల లాడాయి.

దీపావళినాడు మధ్యాహ్నం భోజనాలయ్యాక సుబ్బారావు పిల్లల్తో వీధిలో బాంబు పేల్చాడు. అనసూయ ఇంట్లో పెద్దలవద్ద పేల్చింది పార్వతి కూడా అంగీకరించిందని తెలిసేసరికి సీతమ్మకి దడ పుట్టుకువచ్చింది ఇంట్లో

## కడలి

రాజకీయ నాయకులతో
భుజం కలుపు మిత్రుడివా?
కడుపులోన బడబవహ్ని
మోమున నవ్వుల నురుగులు

అర్థంలేనట్టి ఘోష —
అన్యుల చడీ విననివ్వవు
నిరంతరం పొంగి పొంగి
స్వార్థపు తీరం దాటవు

విశ్వశ్రేయో రత్నా
లున్నాయని వినుటెగాని
లభించేది నీ లోపల
నత్తగుల్లలూ గవ్వలు!

చుట్టవు నదులనేగాని
ఇతర మేది చొరనివ్వవు
అధికారపు విన్యాసం
తరగలలో చూపెడతావ్!

దివ్యధునులు, మధుర నదులు
నిన్ను చెరినంతటనే
మాధుర్యం కోలుపోయి
అడవిగాచు వెన్నెలలగు!!

—లతిక

పిల్లలు సమర్థిస్తున్నా వీధిలో తోటివాళ్లు చెవులు కొరుక్కుంటారన్న భయం పోలేదు.

జానకిరామయ్యను బయల్దేరదీసి రిక్షాలో సీతమ్మ రామాలయం చేరింది

ఇంటి పురోహితుడు దంపతులను చూసి, "రండి! పనిబడి వచ్చినట్టున్నారు" అంటూ ధ్వజస్తంభానికి పక్కగా ఉన్న అరుగుమీదకి తీసుకువెళ్లి కూర్చోబెట్టాడు సీతమ్మ తమకి వచ్చిన సమస్య చెప్పింది.

"అమ్మా! మీరు నానుంచి ఏమాశించి వచ్చారో తెలియదు నాకుతోచిన ధర్మం చెప్తాను మీకు నచ్చకపోవచ్చును"

"అప్రియమైనా కర్తవ్యం చెప్పండి" అన్నాడు జానకిరామయ్య

"శుభం భూయాత్! ప్రతి సమాజం అవసరాల మేరకి న్యాయాలను, నీతుల్ని ఏర్పరచుకొంటుంది. ఇవికాలంతో క్రమేపి మారుతూ వస్తాయి. ఈనాటి మన ఆచారాలు ఆలోచనలు ముందుతరం వారి వాటికి చాలా దగ్గరగాను కొద్దిగా భిన్నంగాను ఉంటాయి మరీ ముందుతరంవారి ఆలోచనల్తో బాగా భేదిస్తాయి. ఆ ఆచారాలు మనకి అనుసరణీయంగా కూడా ఉంటాయి ఉదాహరణకి కుంతి సంతానం పొందిన విధానం, దేవరన్యాయం అనుసరించి వ్యాసుడు చేసిన కురువంశ సృష్టి మనకానాడు వెలపరం పుట్టించేవిగా ఉంటాయి ఆనాటి అవసరాలకి అవి ఏర్పడ్డాయి ఆ అవసరాలు పోయి కొత్త అవసరాలు క్రమేపి ఏర్పడగానే పాతవి అంతరించిపోయి కొత్తవి ఏర్పడ్డాయి బానిసలమీద ఆధారపడ్డ నాగరికతలు విదేశాల్లో ఏర్పడితే విధవల శ్రమమీద మన నాగరికత విలసిల్లింది ఒక మనిషిని వేరొక మనిషి దోచడం సాగనీయక పోవటానికి మనరోజుల్లో ప్రయత్నాలు జరుగుతున్నాయి సమాజం వేగంగా కొత్తరూపులు దిద్దుకొంటోంది మీ నారాయణ నిర్ణయం ఈ కాలానికి చెందింది మనముందు కాలధర్మానికి వ్యతిరేకమైనా భారత కాల ధర్మానికి దగ్గరిది తప్పొప్పుల నిర్ణయం చెయ్యగల శక్తి నాకులేదు కాని ఈ కాలంలో జీవించవలసిన నవతరం వాళ్ల అవసరాలకి తగిన నిర్ణయాలు తీసుకొంటారు మనకవి ఆమోదయోగ్యం కాకపోయినా, మనం ఆటంకపరచరాదు"

"ఇటువంటి సాంప్రదాయాన్ని నెలకొల్పితే, ఒకే ఇంట్లో తిరిగే వదినా మరదుల మధ్య, బావా మరదళ్ళ మధ్య అనుచితమైన సంబంధాలు ఏర్పడవంటారా?" అని అడిగాడు జానకిరామయ్య

"అవకాశం ఒక్కటే మనిషిని చెడుమార్గం పట్టించదు. మనిషికి వ్యక్తిగతంగా కొంత చెడు ప్రకృతి కూడా ఉండాలి కోడల్ని కోరిన మావగార్ని, మరిదితో సంబంధం పెట్టుకొన్న వదినగార్ని పూర్వం లేదా ఇప్పుడు లేరా! వ్యభిచారం వివాహేతర సంబంధం అవటం వల్ల మొదటిది ఉన్నంతకాలం రెండోది ఉంటుంది మీ అబ్బాయికి, కోడలికి నేను వివాహం జరిపిస్తాను మీరు సరేనంటే" అన్నాడు పురోహితుడు

సీతమ్మ, జానకిరామయ్యలు సమాధాన పడ్డారు.

ఇంటి గోడలమీద బారులుగా దీపాలు వెలిగాయి. ఇంటి కోడలి కళ్లు కాంతులీనాయి నవశకానికి బాణసంచాలు స్వాగతం పలికాయి ★